క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక



వెంకట వైష్ణవితో ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం

పాణ్యం: మండలంలోని నెరవాడ మెట్ట వద్ద ఉన్న శాంతిరాం ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థి వెంకట వైష్ణవి రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైందని ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం శుక్రవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ కర్నూల్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి ఎంపిక పోటీల్లో వెంకట వైష్ణవి ప్రతిభ చూపడంతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారని చెప్పారు. అనంతరం విద్యార్థిని అభినందించారు. పీడీ చంద్రారెడ్డి ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గడివేముల: స్థానిక సబ్ స్టేషన్‌లో వివిధ పనుల నిమిత్తం శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ ఖలీల్ పాషా శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. బిలకల గూడూరు, కొరప్రోలురు, బొల్లవరం, ఆళ్లగడ్డ, బూజునూరు గ్రామాలకు ఉదయం నుంచి సాయంత్రం వరకు విద్యుత్ ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

దోమల నివారణకు చేపల విడుదల



అమడగుంట్ల నీటికుంటలో గంబూషియా చేపలను వదులుతున్న వైద్యాధికారులు

కోడుమూరు రూరల్: గ్రామాల్లో దోమల నివారణ కోసం నీటి కుంటల్లో గంబుషియా చేపలను విడుదల చేస్తున్నట్లు లద్దగిరి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ భాస్కర్ తెలిపారు. శుక్రవారం మండలంలోని అమడగుంట్లలోనున్న నీటి కుంటల్లో గంబుషియా చేపలను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ మలేరియా, డెంగీ, చికున్‌గున్యా వంటి ప్రమాదకరమైన దోమల నివారణకు వైద్య సిబ్బందితో కలిసి చర్యలు తీసుకుంటున్నామన్నారు. అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్ చంద్రశేఖర్, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాస్‌యాదవ్, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధి పనులను వినియోగించుకోండి



కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీఓ రాముడు

కోడుమూరు రూరల్: వలసల నివారణలో భాగంగా ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్న పనులను కూలీలు వియోగించుకోవాలని ఎంపీడీఓ రాముడు సూచించారు. శుక్రవారం సాయంత్రం ఏపీఓ మోదీన్‌బాషాతో కలిసి పట్టణంలోని బోయవీధిలో పర్యటించి కూలీలతో మాట్లాడారు. ఉపాధి పథకం కింద కావాల్సినంత మంది కూలీలకు పనులు కల్పిస్తామని చెప్పారు. ప్రభుత్వం నిర్ణయించిన కొలతల ప్రకారం పనులు చేస్తే రోజు వారి వేతనం రూ.300 వరకు పడుతుందన్నారు. ఉపాధి సిబ్బంది గ్రామాల్లో పర్యటించి కూలీల వివరాలను నమోదు చేసుకుని వారికి వెంటనే పనులను కల్పించాలని ఆదేశించారు.

రోడ్డు వెడల్పు చేయండి

కర్నూలు(రూరల్): పెరిగిన వాహనల రద్దీకి అనుగుణంగా కర్నూలు నగరం నుంచి ఉల్చాల గ్రామం వరకు అర్ అండ్‌బీ రోడ్డును వెడల్పు చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు డి.రాఘవేంద్ర కోరారు. ఈ మేరకు శుక్రవారం నగరంలోని అర్‌అండ్‌బీ అధికారి సిద్ధారెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లడుతూ కర్నూలు నగరం నుంచి ఉల్చాల, రేమట గ్రామాల మీదుగా ప్రతిరోజు వందలాది వాహనలు కొత్తకోట, మంత్రాలయం వరకు రాకపోకలు సాగిస్తుంటాయన్నారు. ఈ దారిలో ప్రతి రోజూ వందలాది ఇసుక టిప్పర్లు వెళ్తున్నందున రోడ్డు గుంతల మయమైందన్నారు. సురేష్, ప్రకష్ అంజి ఉన్నారు.

'ఉపాధి'కి నిధులు తగ్గించడం అన్యాయం

ఓర్వకల్లు: రాబోయే బడ్జెట్‌లో ఉపాధి హామీ పథకానికి బడ్జెట్‌ను పెంచాల్సింది పోయి.. తగ్గించడం అన్యాయమని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి నాగన్న పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రం సమీపంలో జరుగుతున్న ఉపాధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, కూలీలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నాగన్న మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉపాధి హామీ పథకాన్ని నిర్లక్ష్యం చేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. పథకానికి మంగళం పలికేందుకే కేంద్ర ప్రభుత్వం నిధుల కేటాయింపు తగ్గిస్తోందన్నారు.

పారిశుద్ధ్యం అస్తవ్యస్తం!



కల్లూరులో చెత్త చెదారంతో నిండిన డ్రైనేజీ

- అర్బన్ కాలనీల్లో పూడిపోయిన డ్రైనేజీలు
- ముందుకు కదలని మురుగు
- దుర్గంధంతో జనం అవస్థలు
- విజృంభిస్తున్న దోమలు
- పట్టించుకోని అధికారులు

కల్లూరు: కల్లూరు అర్బన్ పరిధిలో పారిశుద్ధ్య అస్తవ్యస్తంగా మారింది. మురుగు కాలువలు చెత్త చెదారంతో పూడిపోయినా తొలగించకపోవడంతో మురుగు ముందుకు కదలక దుర్గంధం వెదజల్లడమే కాకుండా దోమలకు ఆవాసాలుగా మారిపోయాయి. దీంతో దోమల బెడద తీవ్రంగా వేధిస్తోంది. ముఖ్యం దిగువ కాలనీల్లో మురుగు భారీగా నిలిచిపోయింది. కనీసం ఆయా ప్రాంతాల్లో ఉండలేనంతగా దుర్వాసన వెదజల్లుతోంది. ఇక దోమలు, ఈగలు బెడద అధికంగా ఉండటంతో జనం వ్యాధుల బారిన పడుతున్నారు. పరిస్థితిని గమనిస్తున్నా పట్టించుకోకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



రాఘవేంద్ర నగర్‌లో డ్రైనేజీ దుస్థితి

పట్టించుకోవడం లేదు



డ్రైనేజీ కాలువలు చెత్త చెద్దారంతో నిండిపోయాయి. కొన్ని రోజులుగా మున్సిపాలిటీ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు. కాలువలు దుర్గంధం వెదజలుతున్నాయి. దోమల బెడద తీవ్రంగా ఉంది. విష జ్వరాలు ప్రబలకముందే అధికారులు స్పందించి పారిశుద్ధ్య పనులు చేపట్టాలి.

– లావణ్య, కల్లూరు

స్పందించడం లేదు



కాలనీల్లో మురుగు కాలువల నిర్వహణ కొరవడింది. చెత్త తొలగించకపోవడంతో మురుగు ముందుకు కదలడం లేదు. ఈ విషయంపై అధికారులకు ఫోన్ చేసినప్పటికీ చర్యలు చేపట్టడం లేదు. ముఖ్యంగా అధికారులు సక్రమంగా స్పందించడం లేదు. ఫోన్ చేసి సమస్యను వివరిస్తే తమ కాదు.. ఇంకొకరికి చేయండని తప్పించుకుంటున్నారు.

– సరస్వతి, కల్లూరు

పార్టీ కోసం పనిచేసే వారికి గుర్తింపు



ఎస్వీ దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

కర్నూలు (టౌన్): పార్టీ కోసం పనిచేసే కార్యకర్తలకు వైఎస్సార్‌సీపీలో ప్రత్యేక గుర్తింపు లభిస్తుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి అన్నారు. ఇటీవల జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడిగా నియమితులైన గోల్డ్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో శుక్రవారం పార్టీ శ్రేణులు జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డిని కలిశారు. ఆయన నివాసంలో ఎస్వీ దంపతులను శాలువా కప్పి గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో పార్టీ కార్యకర్తలకు పదవులు అప్పగించామన్నారు. పదవుల్లో ఉన్న వారంతా పార్టీ కోసం కష్టపడి పనిచేయాలన్నారు. భవిష్యత్తు వైఎస్సార్‌సీపీదే అన్నారు. చంద్రబాబు ఏదో చేస్తారని నమ్మి గెలిపిస్తే అన్ని వర్గాలను ప్రజలను నిలువునా మోసం చేశారన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాధ్యతాయుతంగా పనిచేయండి

కల్లూరు: వైఎస్సార్‌సీపీ కమిటీల్లో పదవులు పొందిన వారు బాధ్యతాయుతంగా పనిచేయాలని ఆ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి సూచించారు. పాణ్యం నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షులుగా నియమితులైన హేమలత, శివకుమార్, జానకమ్మ, లక్ష్మీప్రసాద్ శుక్రవారం కాటసాని రాంభూపాల్‌రెడ్డి, కాటసాని శివనరసింహారెడ్డిని మర్యాదపూర్వకంగా కలసి, శాలువతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. కాటసాని మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా అందరూ పని చేయాలని చెప్పారు.



కాటసాని రాంభూపాల్‌రెడ్డిని కలిసిన నేతలు

ఓటు హక్కు ఎంతో విలువైంది



సి.బెళగల్‌లో ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంపీడీఓ రాణెమ్మ



ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసులు

కోడుమూరు రూరల్: రాజ్యాంగం ప్రసాదించిన హక్కుల్లో ఓటు హక్కు ఎంతో విలువైందని, ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ వెంకటేష్ నాయక్ సూచించారు. శుక్రవారం జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎంపీడీఓ రాముడు, కాలేజీ విద్యార్థులు, బీఎల్వోలతో కలిసి పట్టణంలోని పాతబస్టాండ్ నుంచి కొత్త బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. డీటీ రామాంజనేయులు, ప్రిన్సిపాల్ శేఖర్, బీఎల్వోలు పాల్గొన్నారు.

సి.బెళగల్: ఓటర్లు ఒత్తిళ్లకు లోనకుండా తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ రాణెమ్మ అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో అధికారులు, ప్రజా ప్రతినిధులు, సచివాలయ ఉద్యోగులతో ఓటరు ప్రతిజ్ఞ కార్యక్రమం చేపట్టారు. శనివారం జరగునున్న జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా కార్యక్రమం నిర్వహించినట్లు చెప్పారు. మండల పరిషత్ కార్యాలయ ఏఓ శ్రీనివాసులు, సంగాల సర్పంచ్ హనుమంతు, ఉపాధి హామీ ఏపీఓ రామన్న, పంచాయతీ కార్యదర్శి సునీల్ రాణి, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.



కోడుమూరులో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

ఓర్వకల్లు: అర్హతగల యువతీ,యువకులు ఓటరుగా నమోదు చేసుకోవాలని ఎంపీడీఓ శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుట సిబ్బంది, ప్రజా ప్రతినిధులతో ప్రతిజ్ఞ చేయించారు.

బాలికలను ప్రోత్సహించాలి

గడివేముల: అన్ని రంగాల్లో రాణించేలా బాలికలను ప్రోత్సహించాలని ఎంపీడీఓ వాసుదేవగుప్త అన్నారు. శుక్రవారం కస్తూర్బా, మోడల్ పాఠశాల లో జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సమాజ మార్పునకు ఆడపిల్లల చదువు ఎంతో అవసరమని అన్నారు. బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమన్నారు. అనంతరం విద్యార్థినులకు వ్యాసరచన పోటీలను నిర్వహించి ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఎస్ఐ నాగార్జునరెడ్డి, ఎస్ఓ రుబీనా, ప్రిన్సిపాల్ శైలజ, మహిళా పోలీస్ మల్లికా పాల్గొన్నారు.

పాణ్యం: ఆడపిల్లలు ఉన్నత విద్య చదివేందుకు తల్లిదండ్రులు సహకరించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగసుంకమ్మ కోరారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జాతీయ బాలిక దినోత్సవాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఐ నాగార్జునరెడ్డి



మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగసుంకమ్మ

మెగా డీఎస్సీ ఏమైంది బాబూ?

కర్నూలు(సెంట్రల్): ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య విమర్శించారు. శుక్రవారం సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత మెగా డీఎస్సీ విడుదల చేస్తామని మొదటి సంతకం చేశారన్నారు. అనంతరం 7 నెలలు గడిచిపోయినా ఇంత వరకు డీఎస్సీ ఊసే లేకపోవడంతో ఎంతో మంది నిరుద్యోగులు ఆశగా ఎదురు చూస్తున్నారన్నారు. వేలాది రూపాలయు ఖర్చు పెట్టి కోచింగ్‌లు తీసుకొని చదువుతున్నా నోటిఫికేషన్ రాకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నట్లు చెప్పారు. చెప్పిన మాట ప్రకారం ఉద్యోగాలు ఇవ్వలేని పక్షంలో నిరుద్యోగ భృతి నెలకు రూ.3 వేలైనా ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే తల్లికి వందనం పేరిట ప్రతి విద్యార్థికి రూ.15 వేలు ఇస్తామని చెప్పారని, ఆ ఊసే లేకపోవడంతో మహిళలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. తల్లికి వందనం ఇవ్వకపోయిన తండ్రికి ఇంధనాన్ని మాత్రం చంద్రబాబు ప్రభుత్వం ఇచ్చిందని, ఏ గ్రామంలో చూసినా బెల్టు షాపులు కళకళలాడుతున్నాయని విమర్శించారు. ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, నాయకులు మునెప్ప, కారుమంచి తదితరులు పాల్గొన్నారు.

కృత్రిమ గర్భధారణతో మేలు జాతి దూడలు



లేగ దూడలను పరిశీలిస్తున్న పశుసంవర్ధక శాఖ అధికారులు

కల్లూరు: లింగ నిర్ధారిత వీర్యం ద్వారా కృత్రిమ గర్భధారణ చేయించడం వల్ల మేలు జాతి, మంచి పాలసారగల దూడలు పుడతాయని పశు సంవర్ధక శాఖ జిల్లా సంయుక్త సంచాలకులు డాక్టర్ జి. శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం బొల్లవరం గ్రామంలో లేగ దూడల ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. ఇందుకు జేడీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ పశువు ఎదకొచ్చినప్పుడు కృత్రిమ గర్భధారణ ద్వారా ఎదసూదులు వేయించడం వల్ల మేలు జాతి ఉత్పత్తి అవ్వటమే కాకుండా త్వరగా కట్టు ప్రాయానికి వస్తాయన్నారు. రెండున్నర సంవత్సరాల్లో ఈనుతాయని చెప్పారు. దూడకు దూడకు మధ్య ఎడం తగ్గించాలన్నారు. ఆవులు సంవత్సరానికి ఒక ఈత, గేదెలు 14 నెలలకు ఒక ఈత ఈనేల చూసుకోవాలన్నారు. దూడలకు క్యాల్షియం టానిక్ దాతు మిశ్రమాన్ని, నట్టల నివారణ మందు అందజేశారు. కార్యక్రమంలో కర్నూలు డివిజన్ ఉపసంచాలకులు ప్రసన్న బాబు, అధికారులు రాజశేఖర్, పార్థసారధి, దీప్తి, చంద్రమోహన్, మల్లన్న పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

కర్నూలు (సిటీ): జలవనరుల శాఖలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లుగా పనిచేస్తున్న వారికి ఇటీవల పర్యవేక్షక ఇంజినీర్లుగా పదోన్నతులు లభించాయి. ఇందులో భాగంగా కర్నూలు సర్కిల్ ఎస్ఈగా ద్వారకానాథ్ రెడ్డిని నియమించారు. ఆయన శుక్రవారం ఎస్ఈగా బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పర్యవేక్షక ఇంజినీర్‌గా రెగ్యులర్ ఆఫీసర్ లేకపోవడంతో డిప్యూటీ ఎస్ఈగా పనిచేస్తున్న బాలచంద్రారెడ్డి ఇన్‌చార్జ్ ఎస్ఈగా పనిచేస్తున్నారు. తెలుగుగంగ కడప సర్కిల్ కార్యాలయంలో డిప్యూటీ పర్యవేక్షక ఇంజినీర్‌గా పనిచేస్తున్న ద్వారకానాథ్ రెడ్డిని రెగ్యులర్ ఎస్ఈగా నియమించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన్ను సర్కిల్ ఆఫీస్ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. అనంతరం కర్నూలు ప్రాజెక్టు సీఈ కబీర్ బాషాను ద్వారకానాథ్ రెడ్డి కలిశారు.

నర్సింగ్ కాలేజీలో స్కిల్ ల్యాబ్



జనిత ల్యాబ్ ప్రారంభం సందర్భంగా అధికారులతో నర్సింగ్ కళాశాల సిబ్బంది

కర్నూలు(హాస్పిటల్): స్థానిక ప్రభుత్వ నర్సింగ్ కాలేజీలో జనిత మోన్ స్కిల్ (సిమ్యులేషన్) ల్యాబ్ ఏర్పాటైంది. శుక్రవారం దీనిని కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టిన రసమ్మ, కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ప్రతిష్టాత్మకమైన జనిత స్కిల్ ల్యాబ్ విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంచేందుకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. రోడ్డు ప్రమాదాలు, ప్రసవాలకు వచ్చే రోగులకు వైద్యం ఎలా అందించాలి అనే దానిపై బొమ్మల ప్రోగ్రాం ద్వారా అవగాహన కల్పించేందుకు ఈ ల్యాబ్ ఉపయోగపడుతుందన్నారు. ప్రిన్సిపాల్ ఎస్.మంజులరాణి, వైస్ ప్రిన్సిపల్ వి.ధనలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

టౌన్ ప్లానింగ్‌లో ఒకే ఒక్కడు!



ఎస్వీ కాంప్లెక్స్ ఎదురుగా పార్కింగ్, సెట్‌బ్యాక్స్ లేకుండా నిర్మిస్తున్న వాణిజ్య సముదాయం

- గాడి తప్పిన పాలన
- భవనాల నిర్మాణాలపై పర్యవేక్షణ నిల్
- డీసీపీ, ఏసీపీ, టీపీఎస్, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ల కొరత
- ఆదాయం రాక.. అవినీతి పెరిగి..
- ఫైళ్ల క్లియరెన్స్‌పెండింగ్
- పెండింగ్‌లో బీపీఎస్ దరఖాస్తులు



కర్నూలు (టౌన్) : నగరంలోని ఎస్వీ కాంప్లెక్స్ ఎదురుగా అమరావతి టిఫిన్ సెంటర్ స్థలంలో నూతనంగా జీ ప్లస్ 2 వాణిజ్య సముదాయం నిర్మిస్తున్నారు. పైన అదనంగా నిర్మాణాలు చేపట్టారు. పార్కింగ్ స్థలం లేదు. సెట్‌బ్యాక్స్ లేవు. వాణిజ్య సముదాయాల్లో ఈ రెండు తప్పనిసరి. టౌన్ ప్లానింగ్ అధికారులు ఈ ప్రధాన రోడ్డులో నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. మరి ఈ అక్రమాలు ఎందుకు కనిపించడం లేదో?

- కుడా (కర్నూలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ) చైర్మన్ ఇంటి సమీపంలోనే పదుల సంఖ్యలో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. ఇంటి సమీపంలో పార్కింగ్ లేకుండా వాణిజ్య సముదాయం నిర్మిస్తున్నారు. అదే దారిలోనే ప్రకాష్ నగర్‌లో పార్కింగ్ లేకుండానే నాలుగు అంతస్తుల భవనం నిర్మిస్తున్నారు. ఇలా విచ్చల విడిగా అక్రమ నిర్మాణాలకు కారణం సిబ్బంది కొరతేనన్న విమర్శలు వినిపిస్తున్నాయి.
- నగరపాలక సంస్థలో టౌన్ ప్లానింగ్ విభాగం కీలకం. భవన నిర్మాణాల అనుమతులు, వాణిజ్య సముదాయాలు, వెంచర్లు, అపార్టుమెంట్ల నిర్మాణాల అనుమతులు, వాణిజ్య ప్రకటనలు ఇలా ఎన్నో కీలకమైన పనులు చేయాల్సి ఉంటుంది. ఇటువంటి కీలకమైన ఈ విభాగంపై ప్రభుత్వ నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది. 6.50 లక్షల జనాభా కలిగిన కర్నూలు నగరంలో 52 వార్డులు 1.49 లక్షల ఇళ్లు ఉన్నాయి. నిత్యం కార్యాలయానికి భవన అనుమతుల కోసం, వివిధ పనుల కోసం ప్రజలు వస్తుంటారు. అయితే సిబ్బంది లేకపోవడంతో పాలన గాడి తప్పిందన్న విమర్శలు ఉన్నాయి.

భారమంతా సిటీ ప్లానర్‌పైనే..

నగరపాలక పట్టణ ప్రణాళిక విభాగంలో వాస్తవానికి ఒక సిటీ ప్లానర్, ఒక డిప్యూటీ సిటీ ప్లానర్, ఇద్దరు అసిస్టెంట్ సిటీ ప్లానర్లు, ఐదుగురు టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్లు, ఇద్దరు టౌన్ సర్వేయర్లు, ఐదుగురు బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు, ఒక ట్రేసర్, ఆరుగురు చైన్‌మెన్లు పనిచేయాల్సి ఉంది. అయితే కీలకమైన అనేక పోస్టుల్లో అధికారులు లేకపోవడం, ఉండాల్సిన సిబ్బంది కన్నా తక్కువగా ఉండటంతో పాలనపరమైన ఇబ్బందులు వస్తున్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చి 8 నెలలు అవుతున్నా ఇప్పటికీ డిప్యూటీ సిటీ ప్లానర్, అసిస్టెంట్ సిటీ ప్లానర్ పోస్టులు భర్తీ చేయలేదు. అలాగే ఐదుగురు బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లకు గాను ఒక్కరే పర్యవేక్షణ చేయాల్సి ఉంది. టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్లు సైతం ఇరువురు మాత్రమే ఉన్నారు. ఇరువురు టౌన్ సర్వేయర్లలో ఒకరే పనిచేస్తున్నారు. ఆయన కూడా ఓడీ (అదనపు బాధ్యతలు) కింద పనిచేస్తున్నారు. కర్నూలు నగర పరిధిలో ఇళ్ల స్థలాలు, నిర్మాణాలకు సంబంధించిన వివాదాలు, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వచ్చే ఫిర్యాదులు, కలెక్టరేట్‌తో పాటు వచ్చే ఫిర్యాదులన్నింటినీ టౌన్ సర్వేయర్ పరిష్కరించాల్సి ఉంది. రెండు పోస్టుల్లో ఒకరే పనిచేస్తున్నారు. దీంతో సమస్యలు పెండింగ్‌లో ఉంటున్నాయి. ఇక 3.50 లక్షల జనాభా ఉన్న కర్నూలు కార్పొరేషన్‌లో చైన్‌మెన్లు 6 మంది ఉన్నారు. ఇప్పుడు జనాభా పెరిగింది. వార్డులు పెరిగాయి. నిర్మాణాలు పెరిగాయి. మునగాలపాడు, మామిదాలపాడు, స్టాంటన్‌పురం, పందిపాడు, పెద్దపాడు, లక్ష్మీపురం గ్రామాలను కర్నూలు కార్పొరేషన్‌లో విలీనం చేశారు. తాజాగా 6.50 లక్షలకు జనాభా చేరుకుంది. అయినా చైన్‌మెన్ల సంఖ్య పెరగలేదు. అరకొర సిబ్బందితో టౌన్ ప్లానింగ్ విభాగం నెట్టుకొస్తోంది. ఇక అన్ని క్యాడర్లలో సిబ్బంది లేకపావడంతో ప్రతి పని సిటీ ప్లానర్‌పై పడింది. ఒక్కరే ఉండటంతో ఇబ్బందులు వస్తున్నాయి. ఆఫీసు పనితో పాటు బయట వచ్చే ఫిర్యాదులను తనిఖీ చేయాల్సి ఉంటుంది. దీంతో పాలన ఇబ్బందికరంగా మారింది. అనేక పోస్టులు ఖాళీగా ఉండటంతోనే ఈ సమస్యలు వస్తున్నాయని, ఆ విభాగం సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇవి కాక కోర్టు కేసులు, వాణిజ్య ప్రకటనల ఆదాయం వసూళ్లు ఇబ్బందికరంగా మారాయని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ఆదాయానికి గండి - అటకెక్కిన బీపీఎస్ క్లియరెన్స్

పట్టణ ప్రణాళిక విభాగంలో సరిపడా సిబ్బంది లేకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఆదాయానికి గండి పడుతోంది. ఫ్లెక్సీలు, బ్యానర్లు, అడ్డగోలుగా వెలుస్తున్నాయి. ఆదాయం మాత్రం పెరగడం లేదు. ఆదాయం పక్కదారి పడుతున్నట్లు విమర్శలు ఉన్నాయి. ఇక నగరంలో అనుమతులు లేకుండా నిర్మించుకున్న భవనాలకు బీపీఎస్ (భవనాల క్రమబద్ధీకరణ పథకం) కింద క్లియరెన్స్ నత్తనడకన సాగుతోంది. ఇప్పటివరకు ఈ పథకానికి 14,097 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో 981 దరఖాస్తులు షార్ట్‌ఫాల్ పేరుతో పెండింగ్‌లో ఉన్నాయి. 217 దరఖాస్తులను అధికారులు తిరస్కరించారు. ఇప్పటివరకు ప్రభుత్వానికి రూ.6,36,64,195 ఆదాయం వచ్చింది. ఇప్పటికీ అనేక దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. పర్యవేక్షణ లేకపోవడంతో పాటు అక్రమ నిర్మాణాలపై ఎలాంటి చర్యలు లేకపోవడం కూడా ఒక కారణమని చెప్పవచ్చు. కీలకమైన విభాగంలో కొరత, పర్యవేక్షణ లేకపావడంతోనే ఈ సమస్యలు ఏర్పడుతున్నాయనే విమర్శలు ఉన్నాయి.

పర్యవేక్షణ లేక.. అక్రమాలకు అడ్డగా...

నగర పరిధిలో ఏదైన భవనం, వాణిజ్య సముదాయం, అపార్టుమెంటు నిర్మించాలంటే తప్పనిసరిగా నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళిక విభాగం అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. ఇందుకు ప్లాన్ అనుమతి తీసుకొని నిర్మాణాలు చేపట్టాలి. అయితే నగరంలో పదుల సంఖ్యలో ప్లాన్‌కు విరుద్ధంగా నిర్మాణాలు చేపడుతున్నారు. అదనపు ఫ్లోర్లు యథేచ్ఛగా నిర్మిస్తున్నారు. ఇటువంటి నిర్మాణాలు నగరంలో ఇబ్బడిముబ్బడిగా ఉన్నాయి. వాణిజ్య నిర్మాణాల్లోనూ బేఖాతరు చేస్తున్నారు. అనేక నిర్మాణాల్లో నిబంధనలను పట్టించుకోవడం లేదు. ఇష్టారాజ్యంగా నిర్మాణాలు చేపడుతున్నారు. పార్కింగ్ లేకుండా, సెట్‌బ్యాక్స్ లేకుండా వాణిజ్య నిర్మాణాలు చేస్తున్నారు. సిబ్బంది లేకపోవడంతోనే ఈ సమస్య వస్తోంది. అరకొర సిబ్బంది ఉండటం వల్ల అవినీతి పెరిగింది. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాల విషయంలో చేతివాటం ప్రదర్శిస్తున్నారు. ఇటీవల సంబంధిత 23 భవనాలకు నోటీసులు ఇచ్చారు. చర్యలు తీసుకుంటామని అందులో పేర్కొన్నారు.అయితే నోటీసులు అందుకున్న పలువురు యజమానులు మామూళ్లు ముట్టజెప్పి అక్రమ నిర్మాణాలను కొనసాగిస్తున్నారు.